సాక్షి
ఏలూరు

గురువారం । 19 । అక్టోబర్ । 2023



ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

ఖరీఫ్‌లో పండిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు.

IIలో ▸



మత్స్యకారుల అభివృద్ధికి కృషి

గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు.

IIలో ▸



14 నుంచి హనుమాన్ దీక్షలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో వచ్చేనెల 14 నుంచి మండల దీక్షలు, డిసెంబర్ 1 నుంచి అర్ధ మండల దీక్షలు ప్రారంభం కానున్నాయి.

వృత్తిదారులకు చేదోడు వాదోడుగా..

ఆనందం 'పది'ంతలు

- ఏటా రూ.10 వేల సాయం
- నేడు నాల్గో విడత లబ్ధి అందజేత
- నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు లబ్ధి
- ఉమ్మడి జిల్లాలో 26,184 మంది లబ్ధిదారులు



భీమవరంలో టైలరింగ్ పనిచేస్తున్న దర్జీలు

ఏలూరు (టూటౌన్)/భీమవరం(ప్రకాశం చౌక్): చేతి చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల చొప్పున వైఎస్సార్ చేదోడు పథకం కింద అందిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే మూడు విడతల సాయం అందించగా గురువారం నాలుగో విడత లబ్ధి అందించనున్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీట నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ములు జమచేయనున్నారు. దీనిపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నాయీబ్రాహ్మణ, రజక, టైలరింగ్ వృత్తిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతల్లో రూ.76.15 కోట్ల లబ్ధి

చేదోడు పథకంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో మూడు విడతల్లో 76,168 మందికి రూ.76.16 కోట్ల లబ్ధి చేకూర్చారు. 2020–21లో 26,372 మందికి రూ.26.37 కోట్లు, 2021–22లో 23,380 మందికి రూ.23.38 కోట్లు, 2022–23లో 26,416 మందికి రూ.26.42 కోట్లు లబ్ధి చేకూర్చారు.

జగనన్న చేదోడు లబ్ధిదారులు

జిల్లా	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
ఏలూరు	16,486	16.49
పశ్చిమగోదావరి	9,698	9.70

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే చేకూర్చిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2020–21	26,372	26.37
2021–22	23,380	23.38
2022–23	26,416	26.42

పశ్చిమగోదావరిలో..

నాలుగో విడతలో పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 9,698 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. నియోజకవర్గాల వారీగా ఆచంటలో 1,152 మందికి రూ.1.15 కోట్లు, భీమవరంలో 1,201 మందికి రూ.1.20 కోట్లు, నరసాపురంలో 835 మందికి రూ.0.84 కోట్లు, పాలకొల్లులో 1,155 మందికి రూ.1.16 కోట్లు, తాడేపల్లిగూడెంలో 1,823 మందికి రూ.1.82 కోట్లు, తణుకులో 1,945 మందికి రూ.1.95 కోట్లు, ఉండిలో 1,190 మందికి రూ.1.19 కోట్లు, గణపవరం మండలంలో 397 మందికి రూ.39.70 లక్షల లబ్ధి చేకూర్చనున్నారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లాలో 16,486 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. నియోజకవర్గాల వారీగా.. చింతలపూడిలో 2,258 మందికి రూ.2.26 కోట్లు, దెందులూరులో 2,343 మందికి రూ.2.34 కోట్లు, ఏలూరులో 2,377 మందికి రూ.2.38 కోట్లు, కైకలూరులో 1,159 మందికి రూ.1.16 కోట్లు, నూజివీడులో 3,303 మందికి రూ.3.30 కోట్లు, పోలవరంలో 3,683 మందికి రూ.3.68 కోట్లు, ఉంగుటూరులో 1,363 మందికి రూ.1.36 కోట్ల లబ్ధి చేకూర్చనున్నారు.

ఆర్థిక భరోసా



"ప్రభుత్వం వరుసగా నాలుగో విడత జగనన్న చేదోడు పథకంలో సొంతంగా షాపులు నిర్వహించే నాయీబ్రాహ్మణ, రజక, టైలరింగ్ వృత్తిదారులకు ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. సీఎం జగన్ గురువారం నాల్గో విడత సాయాన్ని లాంఛనంగా విడుదల చేయనున్నారు. చేదోడు సాయంతో వెనుకబడిన వృత్తిదారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోంది.

–ఎస్.పుష్పలత, ఈడీ, బీసీ కార్పొరేషన్,ఏలూరు

మేలు మరువలేం



షాపుల్లో వృత్తి చేసుకునే నాయీ బ్రాహ్మణులకు జగనన్న చేదోడు పథకం ద్వారా వరుసగా నాలుగేళ్ల పాటు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందించడం చాలా గొప్ప విషయం. ప్రభుత్వ సహకారం మరువలేం. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహకారంతో వృత్తిలో అవసరమైన సామాన్లు ఒకేసారిగా కొనుగోలు చేసుకోగలుగుతున్నాం.

– పరిటాల వీరవెంకట ప్రసాద్, ఏపీ నాయీబ్రాహ్మణ సంఘం సహాయ కార్యదర్శి, పోతునూరు, దెందులూరు మండలం

చాలా ఉపయోగం



సీఎం జగన్ ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తూ టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు క్రమం తప్పకుండా ఇవ్వడం అభినందనీయం. ఈ సాయం పేద, మధ్యతరగతి వృత్తిదారులకు చాలా ఉపయోగపడుతుంది. షాపుల అద్దెకు లేదా సామగ్రి ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాం. టైలర్స్ అసోసియేషన్ తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కె.రామకోటేశ్వరరావు, జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

రూ.30 వేలు అందుకున్నా..



జగనన్న చేదోడు పథకం ద్వారా నేను ఇప్పటి వరకు రూ.30 వేలు సాయం పొందాను. ఈ ఏడాది నాలుగో విడత మరో రూ.10 వేలు అందుకోనున్నాను. ఈ మొత్తం షాపు నిర్వహణ ఖర్చులకు ఉపయోగించుకుంటున్నా. అద్దె షాపులు ఉన్న వృత్తిదారులకు ఆర్థిక భరోసా కలుగుతోంది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– తాతపూడి శివ గణేష్, నాయీబ్రాహ్మణుడు, నవుడూరు

న్యూస్‌రీల్

ఎన్నికల సామగ్రి తనిఖీ



తనిఖీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ల మొదటి దశ తనిఖీ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏలూరు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని గొడౌన్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల తనిఖీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈనెల 16న తనిఖీ కార్యక్రమం చేపట్టామని, వచ్చే నెల 10 వరకు కొనసాగుతుందన్నారు. ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్న గొడౌన్ లోపలికి వెళ్లినప్పుడు సంబంధిత రిజిస్టర్‌లో ఆయన సంతకం చేశారు. డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఎఫ్ఎల్‌సీ పర్యవేక్షకులు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్నదొర ఉన్నారు.

గిరిజన దర్బార్



వినతులు స్వీకరిస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం. సూర్యతేజ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నుంచి పలువురు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వినతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

20న దిశ సమావేశం

ఏలూరు(మెట్రో): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) రెండో క్వార్టర్ సమావేశం ఈనెల 20న ఉదయం 11 గంటలకు ఏలూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని గోదావరి సమావేశం మందిరంలో దిశ కమిటీ చైర్మన్, ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన నిర్వహిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. దిశ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

జాతీయ పోటీల్లో స్వర్ణం కైవసం



సాహిల్‌బాబు, ఏలూరు అథ్లెట్

ఏలూరు రూరల్: సౌత్ ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో ఏలూరు అథ్లెట్ కేఎస్ సాహిల్‌బాబు బంగారు పతకం సాధించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు హన్మకొండ జవహర్ లాల్ స్టేడియంలో సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. అండర్–16 విభాగంలో పాల్గొన్న సాహిల్‌బాబు 100 మీటర్ల పరుగును 10.98 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణం సాధించాడు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో శిక్షణ పొందుతున్న సాహిల్‌బాబు ఆరేళ్ల కిందట రికార్డు బ్రేక్ చేశాడని కోచ్ దేవరపల్లి ప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. సాహిల్‌బాబును ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుల్ల ప్రసాద్, చైర్మన్ ఆదిరెడ్డి సత్యనారాయణ, సోషల్ వర్కర్ జిల్లా వీరభద్రరావు అభినందించారు.

ట్రై సైకిళ్ల పంపిణీకి ఏర్పాట్లు



ట్రై సైకిళ్ల అమరికను పరిశీలిస్తున్న ఏడీ

ఏలూరు (టూటౌన్): దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు అర్హులైన శారీరక దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందించేందుకు సిద్ధం చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఉపసంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్ తెలిపారు. స్థానిక కోటదిబ్బలోని దివ్యాంగుల వసతి గృహ ప్రాంగణంలో మూడు చక్రాల సైకిళ్ల అమరికను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ పనులు ముగిసిన తర్వాత అర్హులైన శారీరక దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తామన్నారు.

'జలకళ'తో రైతులకు మేలు



రైతులకు మోటార్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: ప్రభుత్వం జలకళ పథకంలో బోర్లు వేయటం చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు చేస్తోందని, దీనిని మెట్ట రైతులు గుర్తించుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఉంగుటూరులో భీమడోలు, ఉంగుటూరు మండలాలకు చెందిన 45 మంది రైతులకు జలకళ పథకంలో బోర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో బోర్లు వేయించుకోలేని రెండెకరాలు దాటిన రైతులకు జలకళ ఉపయోగపడుతుందన్నారు. సీఎం జగన్ రూపకల్పనతోనే జలకళ కింద ఉచితంగా బోర్లు వేస్తున్నారన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఎన్ఆర్ ఈజీఎస్ సహాయ పథకం సంచాలకుడు జి.సుధాకర్‌రావు, పుప్పాల గోపి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఆయా గ్రామాల మెట్ట ప్రాంత రైతులు బోర్లు అందుకున్నారు.

మహిళలపై అఘాయిత్యాలు ఉపేక్షించం

ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ఎస్పీ

జంగారెడ్డిగూడెం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ బుధవారం తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయంలో రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, దాడులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇటీవల ఏలూరులో మహిళపై జరిగిన దాడిలో భాగంగా నిందితులను 24 గంటల్లో పట్టుకుని జీవిత ఖైదు విధించడమే దీనికి నిదర్శనమన్నారు. మద్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే జంగారెడ్డిగూడెం స్టేషన్ ఆవరణలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను వినియోగం తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గంజాయి, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘ ఉంచినట్లు పేర్కొన్నారు. సీఐ రాజేష్, ఎస్సైలు మల్లికార్జునరెడ్డి, జయబాబు, క్రైమ్ పార్టీ ఏఎస్సై సంపత్ కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తప్పవు

ఏలూరు టౌన్: దెందులూరు మండలం శ్రీరామవరానికి చెందిన ఒక బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.మేరిప్రశాంతి చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందిన సమయంలో దిశా ఎస్సై నిహారిక బాలికతో మాట్లాడి కేసు తీవ్రత దృష్ట్యా దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో వెంటనే కేసు నమోదు చేయించారని తెలిపారు. బాధిత బాలిక ఫిర్యాదుపై నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోందన్నారు. బాలికను ఏలూరు జీజీహెచ్‌కు వైద్యపరీక్షలు నిమిత్తం తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి పంపారని స్పష్టం చేశారు. రెండు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశామని తెలిపారు. బాలికకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మేరీ ప్రశాంతి స్పష్టం చేశారు.

'కౌశల్' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లని ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్యాంసుందర్

ఏలూరు (టూటౌన్): భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్–2023 పరీక్ష నోటిఫికేషన్ విడుదలైందని డీఈఓ పి.శ్యాంసుందర్ తెలిపారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో బుధవారం కౌశల్–2023 పోస్టర్లని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8,9,10 తరగతుల విద్యార్థులతో క్విజ్ టీమ్ ఏర్పడాలని ఇది కేవలం ప్రభుత్వ రంగ పాఠశాలల విద్యార్థులకు మాత్రమేనన్నారు. గణితం, సైన్స్, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి అనే అంశాన్ని నిర్ణయించారన్నారు. పాఠశాల కో–ఆర్డినేటర్లు నవంబర్ 5లోపు విద్యార్థుల పేర్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీవీఎం ఏపీ డాట్ ఓఆర్‌జీలో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 81420 35942లో సంప్రదించాలని కోరారు. ఏడీలు ఎంవీ అవధాని, ఎండీ షరీఫ్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ శ్రీకాంత్, కౌశల్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, జాయింట్ కో–ఆర్డినేటర్ ఎస్వీఎస్ సోమయాజులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కిల్ టెస్టులు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా భవిత సెంటర్‌లో ఖాళీగా ఉన్న సీడబ్ల్యూఎస్ఎన్ రిసోర్స్ పర్సన్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా మెరిట్ జాబితాలోని అభ్యర్థులకు గురు, శుక్రవారాల్లో ఏలూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో స్కిల్ టెస్టులు నిర్వహించనున్నట్టు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థుల సెల్‌ఫోన్లకు సమాచారం పంపుతామని పేర్కొన్నారు.

సీఎం జగన్‌తోనే కొల్లేరు సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ
- 350 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక



కొట్టాడలో ఎమ్మెల్సీ జయమంగళ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న టీడీపీ నేతలు

కైకలూరు: 'నేను.. ఈ ఊరి బిడ్డగా మాట్లాడుతున్నా.. చంద్రబాబు ఎమ్మెల్సీ ఇస్తానని మోసం చేశారు.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో మన కొల్లేరు బిడ్డకు ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చారు.. అన్నట్లుగానే నేను టీడీపీ నుంచి రాజీనామా చేయగానే వైఎస్సార్‌సీపీలో చేర్చుకుని ఎమ్మెల్సీ ఇచ్చారు.. ఇప్పుడు నేను మీ సేవకుడిని.. మనందరం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేద్దాం' అని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని ఆయన స్వగ్రామం కొట్టాడ శివారు రాజుల కొట్టాడలో పార్టీ చేరికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బుధవారం పాల్గొన్నారు. వందలాది మంది గ్రామస్తులు జయమంగళకు స్వాగతం పలికారు. మాజీ టీడీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పెద్దలతో పాటు మొత్తం 350 మంది ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరారు. నాయకులకు పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి స్వాగతించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కొల్లేరు గ్రామాలు ఐక్యతకు నిదర్శనంగా ప్రతి ఎన్నికల్లోనూ నిలుస్తున్నాయన్నారు. కొల్లేరు ప్రాంతానికి చెందిన రెగ్యులేటర్లు, వారధి నిర్మాణానికి సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చారన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. రాజుల కొట్టాడ చేరడానికి మధ్యలో ఉప్పుటేరు పడవలపై దాటాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో పడవ దాటకుండా ఒక బూత్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను కోరానన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజార్టీతో ఇక్కడ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ మైల నరసింహాస్వామి, మాజీ ఎంపీటీసీ సైదు రాంబాబు, పొన్నమండ శ్యాంబాబు, నాయకులు ఒడుగు నాగరాజు, సైదు కామేష్, సాయి దాదాపు 350 మంది ప్రజలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ నాయకులు ముంగర నరసింహారావు, సర్పంచ్ కొల్లాటి పద్మావతి, ఎంపీటీసీ సిద్దాబత్తిన సువర్ణ, ఉప సర్పంచ్ శేషారత్నం, వార్డు సభ్యురాలు గంగాభవానీ, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, సతీష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ధనలక్ష్మీ నమోస్తుతే

జిల్లావ్యాప్తంగా శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఆలయాలు, పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవార్లను ధనలక్ష్మి మాతగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



ఏలూరు (టూటౌన్): పత్తేబాదలో కనకదుర్గమ్మ



జంగారెడ్డిగూడెం: విజయదుర్గ ఆలయంలో అలంకరణ



జంగారెడ్డిగూడెం: గంగానమ్మవారు



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మవారు



నిడమర్రు: మందలపర్రులో ఉమాదేవి



గణపవరం: వాసవీమాత

క్లుప్తంగా

విద్యుత్ స్తంభం పైనుంచి పడి యువకుడి మృతి


గొరికిపూడి వీరబాబు (ఫైల్)

పెదవేగి: విద్యుత్ స్తంభం పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ఎం.లక్ష్మణ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన గొరికిపూడి వీరబాబు (21) ఫైబర్ నెట్ కేబుల్ పనులు చేస్తుంటాడు. కవ్వగుంటలో బుధవారం కేబుల్ పని నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కగా ప్రమాదవశాత్తు స్తంభం పైనుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అతనిని పరీక్షించగా, అప్పటికే వీరబాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొయ్యూరు రైల్వే గేటు సమీపంలో బుధవారం రైలు ఢీకొని ఒక గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. మృతుడు వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటాయని రైల్వే పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలియలేదని, మృతుడి శరీరంపై నీలం రంగు పొడుగు చేతుల జీన్స్ షర్ట్, సిమెంట్ రంగు నిలువు చారలు కలిగిన ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఏలూరు రైల్వే ఎస్సై నర్సింహరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారక్షణ భేరీ యాత్రను జయప్రదం చేయాలి

ఏలూరు (టూటౌన్): సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి ప్రజా రక్షణ భేరి యాత్రలు నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. పవరుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ తరగతులు, వర్గాల ప్రజల సమస్యలపై రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోరుతూ ఈ నెల 30 నుంచి పార్వతీపురం, శ్రీకాకుళం, కర్నూలు నుంచి రాష్ట్ర బస్సు యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. యాత్రల అనంతరం నవంబరు 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ పాల్గొన్నారు.

సురక్ష వైద్యశిబిరాల్లో టెలీ కన్సల్టేషన్ సేవలు

పాలకొల్లు అర్బన్: టెలీ కన్సల్టేషన్ ద్వారా ఆరోగ్య సలహాలు అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఏర్పాట్లు చేసినట్లు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు చెప్పారు. శివదేవునిచిక్కాలలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రక్త పరీక్షలు, మందుల విభాగం, సాధారణ రోగులను పరీక్షించే తీరును ఆయన పరిశీలించారు. అలాగే అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులోకి వచ్చి ఆరోగ్య సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన టెలీ కన్సల్టేషన్ సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరంలో రాగి జావ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- ఎల్.అగ్రహారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్‌లో పండిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఎల్.అగ్రహారం గ్రామంలోని ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సాయంత్రం కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించగా, ధాన్యం కొనుగోళ్లను కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా తాడేపల్లిగూడెం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం పరిపాటిగా వస్తోందన్నారు. ఇక్కడి రైతులు భూగర్భ జలాలపై ఆధారపడి ముందుగానే పంట పండిస్తుంటారన్నారు. దీంతో ముందుగానే కోతలు వస్తుంటాయన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ స్థాయి కంటే తక్కువగా వర్షాలు పడ్డాయన్నారు. అయితే 40 నుంచి 50 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయన్నారు. గత సీజన్‌తో పోల్చుకుంటే ఈ సీజన్‌లో కేంద్రం రూ.168 అదనంగా ధర పెంచిందన్నారు. దీంతో 75 కిలోల బస్తాకు రూ.1652 ధర లభిస్తుందన్నారు. గత చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఏనాడూ రైతులకు సకాలంలో సొమ్ములు చెల్లించలేదని దుయ్యబట్టారు. 2019లో రైతులకు చెల్లించాల్సిన రూ.1800 కోట్లను పసుపు కుంకుమ పేరిట డ్వాక్రా మహిళలకు చెల్లించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే రైతులకు సొమ్ములు చెల్లించడం జరిగిందన్నారు.

నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. దీనికి అనుగుణంగా గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు మేలు జరుగుతుందనే ఆకాంక్షతో ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. గతంలో కొందరు వ్యక్తుల ఖాతాలకే ధాన్యం సొమ్ములు జమ అయ్యేవని, ప్రస్తుత ప్రభుత్వంలో నేరుగా రైతుల ఖాతాలకు సొమ్ములు జమ చేస్తున్నట్టు తెలిపారు. రవాణా ఛార్జీలను సైతం రైతు లేదా ట్రాన్స్‌పోర్టర్స్ ఖాతాకు జమ చేస్తున్నామన్నారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం చేయకూడదనే ఉద్దేశంతో పర్యవేక్షణ యంత్రాంగం పనిచేస్తోందన్నారు. విక్రయించిన 21 రోజుల్లోనే రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని లబ్ధి పొందాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు, డీఎస్‌వో ఎస్.సరోజ, ఆర్డీవో చెన్నయ్య, సివిల్ సప్లయిస్ మేనేజర్ టి.శివరాంప్రసాద్, డీసీవో ఎం.రవికుమార్, సొసైటీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్.నరేంద్రకుమార్, డీటీవో ఇన్‌ఛార్జ్ జి.సంజయ్ కుమార్, ఎంవీఐ డీఎస్ఎస్.నాయక్, ఏడీఏ పి.మురళీకృష్ణ, తహసీల్దార్ జీవీ.శేషగిరిరావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైకాల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలి

రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలని, దీనిపై సీఎం వైఎస్ జగన్ సైతం దృష్టి సారించారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. చిరు ధాన్యాల సాగులో ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పురుగు మందుల రహిత సాగు చేపట్టాలన్నారు. ప్రతి రైతు ఆర్‌బీకేల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని కోరారు.

అంధుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అంధులు

కైకలూరు: వారందరికీ కంటి చూపు లేదు. అయితేనేం ఆత్మీయ స్పర్శతో పలకరించుకుంటూ ఆలింగనం చేసుకుని మురిసిపోయారు. బ్రెయిలీ లిపిలో చదువుకున్న అలనాటి పాఠశాల తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ అరుదైన ఘట్టానికి ఆటపాక సూర్య హైట్స్ అపార్ట్‌మెంట్ వేదికైంది. బుధవారం అందరూ ఒకే వేదికపైకి చేరి సందడి చేశారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంధ తెలుగు ఉపాధ్యాయుడు జి.సురేష్, తాటిపాక ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తోన్న అంధురాలు సుజాత భార్యాభర్తలు. వీరి చదువుకునే సమయంలో తమ తోటి అంధులందరినీ విందుకు ఆహ్వానించారు. ఇప్పటికే అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. అంధులకు అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఒకరినొకరు వాట్సాప్ సందేశాలను పంచుకున్నారు. విజయవాడ, హైదరాబాదు, విశాఖపట్నం, రాజమండ్రి, అమలాపురం, శ్రీకాకుళం వంటి ప్రాంతాల నుంచి 81 మంది ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు.

గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి కృషి

పోగొండ, జల్లేరు జలాశయాల్లో 4 లక్షల చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే బాలరాజు


పోగొండ రిజర్వాయర్‌లో చేపపిల్లలను వేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. చింతలగూడెం సమీపంలో ఉన్న పోగొండ రిజర్వాయర్ జలాశయం, దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయంలోకి బుధవారం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా సుమారు రూ.ఏడు లక్షల విలువైన నాలుగు లక్షల చేప పిల్లలను బాలరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉన్న జలాశయాలు సన్నచిన్న కారు రైతులకు సాగు నీటి వినియోగానికి ఉపయోగపడటమే కాక మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సయ్యద్ బాజీ, సర్పంచ్‌లు సరియం లక్ష్మీ, మడకం రామలక్ష్మి, జోడే సత్యదుర్గాప్రసాద్, కుంజా వెంకటేశ్వరావు, నాయకులు తెల్లం దేవరాజు, దినేష్ పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం


జంగారెడ్డిగూడెం రూరల్: దేవులపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

'ఉపాధి హామీ' నిర్వీర్యం తగదు


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ శివదాసన్

ఏలూరు (టూటౌన్): పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం రాజ్యసభ ఎంపీ, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు శివదాసన్ తీవ్రంగా విమర్శించారు. ఆర్ఆర్‌పేటలో సీపీఎం ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్ట పరిరక్షణ పని దినాలు, వేతనాల పెంపుకై రాష్ట్ర సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సుకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.రవి అధ్యక్షత వహించారు. సదస్సులో పలు తీర్మానాలు చేశారు. ముఖ్యఅతిథి శివదాసన్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి 2022–23లో రూ.లక్ష కోట్లు కేటాయిస్తే 2023–24లో రూ.70 వేల కోట్లుకు కుదించడం అన్యాయమన్నారు. బడ్జెట్ నిధుల కోతల ఫలితంగా అడిగినవారందరికీ పనులు కల్పించలేకపోతున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులందరికీ ఉపాధి కల్పించి కనీస వేతనాలు అమలు జరపాలని కోరారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 200 రోజుల పనులు కల్పించి, కనీస వేతనం రూ.600 అమలు చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, రాష్ట్ర నాయకురాలు వి.శివనాగరాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడితో డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్

దెందులూరు: శ్రీరామవరంలో వలంటీర్ నీలాపు శివకుమార్ ఆధార్ వివరాల కోసం వెళ్లి బాలికను అత్యాచారం చేశాడనే వార్తలు అవాస్తవమని, బాలికకు వరుసకు దూరపు బంధువు అవుతాడని నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ చెప్పారు. బుధవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మాట్లాడారు. శ్రీరామవరంలో బాలికను ఏడాది నుంచి ప్రేమ పేరిట వేధిస్తున్నాడని బాలిక తల్లి లిఖితపూర్వకంగా దెందులూరు స్టేషన్‌లో ఈ నెల 5న ఫిర్యాదు చేసిందన్నారు. ఫిర్యాదులో నిందితుడిని బంధువు, మేనల్లుడు అవుతాడని పేర్కొందన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి తానే విచారణ చేపట్టానన్నారు. బాలికకు విజయవాడలో వైద్యపరీక్షలు చేయించామన్నారు. బుధవారం నిందితుడిని అరెస్టు చేశామని, గురువారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. నిందితుడి అరెస్టు రాజకీయ ఒత్తిళ్లు లేవని, పోలీసు శాఖను నిందిస్తూ అప్రతిష్టపాలు చేసేలా దుష్ప్రచారం చేయడం తగదని డీఎస్పీ అన్నారు.

గంజాయి కలిగి ఉన్న ముగ్గురి అరెస్టు


అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

ఆగిరిపల్లి: గంజాయి కలిగి ఉన్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 1125 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నంబూరు చంటిబాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై బుధవారం ఉదయం తహసీల్దార్ ఎం.ఉదయభాస్కర్ సమక్షంలో స్థానిక నూజివీడు రోడ్డులో ఉన్న వడ్లమాను కరెంట్ ఆఫీస్ వద్ద బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన మల్లెల వెంకట సుబ్రహ్మణ్య సాయి లోహిత్ (19), ఎన్టీఆర్ జిల్లా జీ కొండూరు మండలం వెలగలేరుకు చెందిన బొమ్మనబోయిన శివాజీ (21), ఆగిరిపల్లి మండలం నెక్కలంగొల్లగూడెంకు చెందిన గంపా గోపీ సాయికుమార్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి 1125 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దీనిపై నూజివీడు రూరల్ సిఐ పీ బాలసురేష్‌బాబు దర్యాప్తు చేసి ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది.

మొబైల్ షాపు యజమానిపై చీటింగ్ కేసు

జంగారెడ్డిగూడెం: భారతీ ఎయిటెల్ లిమిటెడ్ చీఫ్ నోడల్ అధికారి వి.వెంకట నారాయణన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ మొబైల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.మల్లికార్జునరెడ్డి చెప్పారు. వివరాలు ప్రకారం.. జంగారెడ్డిగూడెంలో వాసవీమొబైల్స్ యజమాని ఒక వ్యక్తికి చెందిన ఆధార్ కార్డును ఉపయోగించి, వేర్వేరు పేర్లతో, వివరాలు మార్చుతూ ఒకే వ్యక్తి ఫొటోతో సదరు వ్యక్తికి తెలియకుండా ఎయిర్‌టెల్ మొబైల్ కనెక్షన్లు తీసుకుని భారతీ ఎయిటెల్ లిమిటెడ్ కంపెనీని మోసం చేశాడన్నారు. సదరు మోసాన్ని, ఫోర్జరీని గుర్తించిన వెంకట నారాయణన్ తప్పుడు కనెక్షన్లను నిలిపివేసినట్లు చెప్పారు. వాసవీ మొబైల్స్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వింత దూడ జననం


వరాహ రూపంలో జన్మించిన దూడపిల్ల

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో ఓ రైతుకు చెందిన గేదె వరాహ రూపంలో ఉన్న దూడకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన కొద్దిసేపటికే వింత దూడ మృతి చెందింది. వింత ఆకారంతో దూడ పుట్టిందని తెలుసుకున్న ప్రజలు దీనిని చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జీన్స్ లోపం వల్ల దూడ వింతరూపంలో జన్మించిందని జీలుగుమిల్లి పశువర్ధక శాఖ అధికారి సాయి బుచ్చారావు చెప్పారు.